రాగం: కురంజి

తాళం: తిశ్ర ఏక

సువ్వి సువ్వి సువ్వి సువ్వని
సుదతులు దంచెదరోలాల

౧. వనితలు మనసులు కుందెన చేసిటు
వలపులు తగనించోలాల
కనుసన్నలనెడు రోకండ్లను
కన్నెలు దంచెదరోలాల

౨. ఘల్లు ఘల్లుమను కంకణరవముల
పల్లవపాణులనోలాల
అల్లన నడుములు అసియాడుచు సతు
లొల్లనె దంచెదరోలాల

౩. కప్పురగందులు కమ్మనిపువ్వుల
చప్పరములలోనోలాల
తెప్పలుగా రతిదేలుచు గోనే-
టప్పని బాడెదరోలాల